నమస్తే తెలంగాణ
మెదక్
I | హైదరాబాద్, శుక్రవారం 28 మార్చి 2025 | MEDAK

బెల్టు దుకాణాలను నిర్మూలించాలి

- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

అసెంబ్లీలో మాట్లాడుతున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక, మార్చి 27: గ్రామాల్లో బెల్టు దుకాణాలు నిర్మూలించాలని గురువారం అసెంబ్లీలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బెల్టు దుకాణాలను పూర్తిగా నిర్మూలించి, ప్రజల ప్రాణాలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉంటుందన్నారు. దుబ్బాక నియోజకవర్గంలో విచ్చలవిడిగా నిర్వహిస్తున్న బెల్టు దుకాణాలను నిర్మూలించడంలో అధికారులు విఫలమయ్యారన్నారు. గ్రామాల్లోకి వెళ్లినప్పుడు మహిళలు బెల్టు దుకాణాల గురించి ఫిర్యాదు చేస్తున్నారని తెలిపారు. మద్యం తాగి అనారోగ్యానికి గురవుతున్నారని, యువత రోడ్డు ప్రమాదాల బారినపడి ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారంటూ మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని వివరించారు. యథేచ్ఛగా బెల్టు దుకాణాలు నిర్వహించడంతో పల్లెల్లో 24 గంటలు మద్యం ఎరులైపారుతుందన్నారు. మద్యం మత్తులో గొడవలకు దిగి పంచాయతీలు, పోలీసు స్టేషన్ల చుట్టూ తిరుగుతూ ఆర్థికంగా నష్టపోతున్నారని ప్రభుత్వానికి ఎమ్మెల్యే విన్నవించారు. మహిళలను కోటీశ్వరులను చేస్తామని గొప్పగా చెబుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం ముందుగా గ్రామాల్లో బెల్టు దుకాణాలను నిర్మూలించాలన్నారు.

కూడవెల్లి వాగుపై వంతెన నిర్మించాలి

కూడవెల్లి వాగుపై వంతెనతోపాటు ఆర్‌అండ్‌బీ రోడ్డు నిర్మించాలని, మిరుదొడ్డి, తొగుట మండలాల ప్రజలతో పాటు ప్రయాణికులకు ప్రధాన సమస్యగా మారిందని ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి ప్రభుత్వానికి విన్నవించారు. ఎనిదేండ్ల నుంచి అల్వాల్-మెట్టు రోడ్డు నిర్మాణం పూర్తికాకపోవడంతో సమస్యగా మారిందన్నారు. ఆ రెండు గ్రామాల మధ్య కూడవెల్లి వాగు ప్రవాహం ఉంటుందని, వాగుపై వంతెన నిర్మాణం చేపట్టాల్సి ఉందన్నారు. ఇందుకు పిల్లర్లు సైతం నిర్మించారని, 2017లో ల్యాండ్ ఇష్యూ కారణంగా వంతెన నిర్మాణ పనులు అర్ధంతరంగా నిలిచిపోయినట్లు తెలిపారు. ఇప్పుడు ల్యాండ్ ఇష్యూ తొలిగిపోయినందున, రోడ్డు నిర్మాణం త్వరగా పూర్తి చేసి సమస్య పరిష్కరించాలన్నారు.

రోడ్డు పనులు పూర్తి చేయాలి

- అసెంబ్లీలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల, మార్చి 27: అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రజా సమస్యలతో పాటు నియోజకవర్గంలో నెలకొన్న వివిధ సమస్యలపై గళమెత్తుతున్నారు. చేర్యాల ప్రాంతంలో తపాస్‌పల్లి, లద్నూరు రిజర్వాయర్‌లోకి గోదావరి జలాలు విడుదల చేయకపోవడంతో రైతాంగం పరిస్థితులు, పంటలు ఎండిన వైనంపై అసెంబ్లీలో ప్రస్తావించి దేవాదుల నీళ్లు పంపింగ్ ప్రారంభించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి విజయం సాధించారు. జనగామ, చేర్యాల ప్రాంతాల్లోని వివిధ గ్రామాల్లో అసంపూర్తిగా ఉన్న రోడ్డు పనులను పూర్తిచేయాలని ఆయన గురువారం అసెంబ్లీలో డిమాండ్ చేశారు. ఆర్‌అండ్, ఐటీడీఏ, పీఆర్ రోడ్లు టెండర్లు పూర్తిచేసి కంకరపోసి అసంపూర్తిగా ఉన్నాయన్నారు. చేర్యాల మండలంలోని శభాష్‌గూడెం నుంచి జనగామ జిల్లా బచ్చన్నపేట మండలంలోని సాల్వాపూర్‌కు వెళ్లే రోడ్డు పనులు కంకరపోసి అసంపూర్తిగా వదిలిపెట్టారని, కంకరపై ప్రయాణించడానికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ధూళిమిట్ట మండలంలోని కొండాపూర్ నుంచి రామవరం వయా బెక్కల్ తండా రోడ్డు కంకరపోసి ఉండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. జనగామ మండలంలోని వివిధ గ్రామాల్లో ఇదే పరిస్థితి ఉందన్నారు. అసంపూర్తి రోడ్లను పూర్తిచేయాలని సంబంధిత శాఖ దృష్టికి తీసుకువచ్చారు. జనగామ, చేర్యాల సమస్యలపై అసెంబ్లీలో మాట్లాడుతూ, వాటి పరిష్కారానికి కృషిచేస్తున్న ఎమ్మెల్యే పల్లాకు ప్రజలు రుణపడి ఉంటారని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, ఆర్‌అండ్‌బీ రిటైర్డ్ ఈఈ ముస్త్యాల బాల్‌నర్సయ్య అన్నారు. ఎమ్మెల్యే సమస్యలను ప్రస్తావిస్తుండడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.

రైతులకు పరిహారం ఇవ్వాలి

- అసెంబ్లీలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

అసెంబ్లీలో మాట్లాడుతున్న నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

కొల్చారం, మార్చి 27: ఘనపూర్ ప్రాజెక్టు నీటిమట్టం పెంచేందుకు చేపట్టిన పనుల్లో భూములు కోల్పోయిన రైతులకు పరిహారం విడుదల చేయాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఈ విషయంపై ఎమ్మెల్యే గురువారం అసెంబ్లీలో మాట్లాడారు. మెదక్ జిల్లా కొల్చారం మండల పరిధిలోని చిన్నఘనపూర్ శివారు ప్రాంతంలోని చిన్న నీటిపారుదల ప్రాజెక్టు అయిన ఘనపూర్ ఆయకట్టు సామర్థ్యాన్ని 0.3 టీఏంసీలకు పెంచడానికి పనులు ప్రారంభించారని, ఇందుకు సంబంధించి ముంపు ప్రాంతాల రైతుల నుంచి 800 ఎకరాల భూమిని సేకరించారన్నారు. వీరికి ఏడు కోట్లు పరిహారం ఇవ్వాల్సి ఉండగా, ఇప్పటి వరకు విడుదల చేయలేదన్నారు. బాధిత రైతులు ఇటు భూములు సాగు చేసుకోలేక, అటు పరిహారం రాక ఇబ్బందులు పడుతున్నారని గుర్తు చేశారు. ప్రభుత్వం పరిహారం ఇచ్చి రైతులను ఆదుకోవాలని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి కోరారు.

మీడియాకు నో ఎంట్రీ



కంగ్టి తహసీల్ కార్యాలయంలో మీడియాకు 'నో ఎంట్రీ' అంటూ పోస్టర్ అతికించిన అధికారులు

కంగ్టి, మార్చి 27: సంగారెడ్డి జిల్లా కంగ్టి తహసీల్ కార్యాలయంలో గురువారం మీడియాకు 'నోఎంట్రీ' అంటూ తహసీల్దార్, అధికారులు పోస్టర్ అతికించడంతో వివాదం చెలరేగింది. ఈ విషయం తెలుసుకున్న విలేకరులు తహసీల్ కార్యాలయానికి చేరుకోగానే సిబ్బంది వాటిని తొలిగించారు. ఎందుకు పోస్టర్ అతికించారని ప్రశ్నించేందుకు తహసీల్దార్ ఛాంబర్‌లోకి వెళ్లగా, ఇది గమనించిన తహసీల్దార్ నజీమ్‌ఖాన్ పక్కనే ఉన్న పోలీస్ స్టేషన్‌కు వెళ్లి విలేకరులను పిలిపించాలని ఎస్సై విజయ్ కుమార్‌ను సూచించారు. దీంతో కార్యాలయంలో ఉన్న విలేకరులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి పోస్టర్ విషయం అడిగేందుకు వెళ్లామని ఎస్సై సృష్టం చేశారు. మీడియాను కట్టడి చేసేందుకు తహసీల్దార్ ప్రయత్నిస్తున్నారని విలేకరులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మీడియాపై విషం వెళ్లగక్కిన తహసీల్దార్‌పై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

మండుటెండల్లో ఉపాధి పనులు

అసౌకర్యాల నడుమ అవస్థలు పడుతున్న కూలీలు

- పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయని అధికారులు
- ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యం మూలంగా సేదతీరడానికి నిలువ నీడ లేని దుస్థితి
- కనిపించని టెంట్లు... మెడికల్ కిట్లు..
- అన్ని సౌకర్యాలు కల్పిస్తామంటున్న అధికారులు

మెదక్: టేక్మాల్ మండలంలో ఎండలో పనులు చేస్తున్న ఉపాధి హామీ కూలీలు

జహీరాబాద్: ఎండలోనే ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు

వలసలు తగ్గించి స్థానికంగా పని కల్పించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిన మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనులు అసౌకర్యాల మధ్య కొనసాగుతున్నాయి. పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలనే ఆదేశాలు ఉన్నప్పటికీ ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యం మూలంగా ఉపాధి కూలీలు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పూట గడవాలంటే ఉపాధి పనులకు వెళ్లక తప్పని కూలీలు అసౌకర్యాల లేమితో ఎండలో నానా అవస్థలు పడుతూ పనులు చేస్తున్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా ప్రస్తుతం గ్రామాలకు దూరంగా ఉన్న చెరువుల్లో గుంతలు, పూడిక తీసే పనులు కొనసాగుతున్నాయి. ఎర్రటి ఎండలో చెమటోడ్చి పని చేసిన వారికి కాసేపు సేదతీరడానికి నీడ లేని దుస్థితి నెలకొంది.

మెదక్ (నమస్తే తెలంగాణ)/జహీరాబాద్, మార్చి 27: 2025-26 ఆర్థిక సంవత్సరంలో పనిదినాలను ఖరారు చేసేందుకు ఇటీవల గ్రామసభలు నిర్వహించారు. ముఖ్యంగా ఇంకుడుగుంతలు, పశువుల షెడ్లు, నీటి తొట్లు, నర్సరీల ఏర్పాటు, చెక్‌డ్యామ్‌లు, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం, నీటి పారుదల కాల్వల పూడికతీత, పంటపొలాలకు అనుసంధాన రోడ్లు, నీటికుంటల నిర్మాణం, హరితహారం మొక్కలకు కంచె ఏర్పాటు, మొక్కలకు నీరు పోసే పనులకు ప్రాధాన్యం ఇచ్చారు. భానుడు భగభగమండుతుండటంతో కూలీలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని పనులు చేయాల్సి వస్తోంది. ఉపాధి కూలీలు పని చేసే ప్రదేశంలో మౌలిక వసతులు కరువయ్యాయి. ఉపాధి హామీ చట్టం ప్రకారం పని ప్రదేశంలో నీడ, తాగునీరు, మెడికల్ కిట్లు అందుబాటులో ఉండాలని నిబంధనలు ఉన్నప్పటికీ అవి ఏమి కానరావడం లేదు. కనీసం తాగునీరు లేకపోవడంతో కూలీలు తమవెంట నీళ్ల బాటిళ్లు తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంటుంది. గ్రామం నుంచి ఎక్కడో దూరంలో ఉన్న ప్రాంతంలో ఉపాధి పనులను గుర్తించి చేయిస్తుండడంతో కూలీలు ప్రతిరోజూ రెండు కిలోమీటర్లు నడిపి వెళ్తున్నారు.

కనిపించని మెడికల్ కిట్లు, తాగునీరు

కూలీలకు అత్యవసర సమయాల్లో ఉపయోగించే మెడికల్ కిట్లను అందించాల్సి ఉండగా అధికారులు గతేడాది నుంచి అటువంటి చర్యలు చేపట్టంలేదు. ఎండతీవ్రతతో అనేక మంది తీవ్ర అస్వస్థతకు గురై సొమ్మసిల్లి పడిపోయిన ఘటనలు అనేకం. పని ప్రాంతాల్లో ఎక్కువగా తేళ్లు, పాముకాట్లకు గురయ్యేవారు అనేకం ఉన్నారు. దీంతో ప్రథమ చికిత్స కిట్లు లేక కూలీలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కూలీలకు మజ్జిగ, తాగునీరు పంపిణీ చేయాల్సి ఉన్నా ఎక్కడా చేపట్టటం లేదు. కూలీలంతా పని ప్రదేశానికి బాటిళ్ల ద్వారా నీళ్లు తీసుకెళ్తున్నారు. పనులకు వచ్చే వారికి రూ.300 కూలీ ఇవ్వాల్సి ఉంది. కానీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సగటు కూలీ రూ.220 అందుతుందని కూలీలు వాపోయారు.

ఎండ తీవ్రతతో తల్లడిల్లిపోతున్న కూలీలు

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో మండుటెండలకు పనులు చేయలేక కూలీలు తల్లడిల్లిపోతున్నారు. డీఆర్డీఏ జహీరాబాద్ క్లస్టర్ పరిధిలో 73,406 జాబ్‌కార్డులుండగా, 48,410 మంది కూలీలు యాక్టీవ్‌గా పనిచేస్తున్నారు. వేసవిలో కూలీలు పనిచేసే ప్రదేశాల్లో సేద తీరడానికి టెంట్లు, తాగునీరు, ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచాలి. కానీ వీటన్నింటిని ఏర్పాటు చేయడం లేదని, అసలు ప్రభుత్వం పట్టించుకోవడం లేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూలీలు చస్తే చావని కానీ, తమకు ఎందుకులే అన్నట్లుగా అధికారులు వ్యవహరిస్తున్నారని మండిపడుతున్నారు. కనీసం తాగునీటి సౌకర్యం కల్పించకపోగా, ఇంటి నుంచే తెచ్చుకుంటున్నామని కూలీలు వాపోతున్నారు. ఎండ తీవ్రతకు తెచ్చుకున్న నీరు వేడిగా అవుతుండడంతో తాగలేకపోతున్నామన్నారు. రోజురోజుకూ ఎండ తీవ్రత పెరిగిపోతుండడడంతో ఎక్కడ వడదెబ్బ తగులుతుందోనని భయం కూలీలను వెంటాడుతోంది. టెంట్లు లేక చెట్ల కిందకు వెళ్లి సేద తీరాల్సిన పరిస్థితి నెలకొందంటున్నారు. బీఆర్ఎస్ పాలనలో కూలీలకు సేద తీరడానికి టెంట్లు ఏర్పాటు చేసింది. ప్రస్తుతం వాటన్నింటినీ కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేయడంతో కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మెదక్ జిల్లాలో జాబ్ కార్డులు 1,64,368

కుటుంబాలు	3,31,555
2024-25లో పనిదినాల లక్ష్యం	45.58 లక్షలు
పూర్తిచేసిన పనిదినాలు	40.89 లక్షలు
ఈ ఏడాది పనిచేసిన కూలీలు	1,53,793మంది
చెల్లించిన కూలీ	రూ.89.47 కోట్లు
వంద రోజులు పూర్తయిన కుటుంబాలు	2,446



జహీరాబాద్: ఎండలోనే ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు

కూలీలకు సౌకర్యాలు కల్పిస్తున్నాం...

మెదక్ జిల్లాలో ఉపాధి పనులకు వెళ్తున్న కూలీలకు ఇబ్బందులు కలుగకుండా చూస్తున్నాం. కూలీలకు సౌకర్యాలు కల్పించాలని ఆదేశాలు వచ్చాయి. సూచనలను జిల్లాలోని ఎంపీడీవోలకు పంపించాం. పని ప్రదేశాల వద్ద తాగునీరు, టెంట్లు కల్పించాలని గ్రామ పంచాయతీ వారికి సూచించాం. ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మెడికల్ కిట్లు ఏఎన్ఎంల వద్ద అందుబాటులో ఉన్నాయి. పని ప్రదేశంలో ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. – శ్రీనివాస్‌రావు, డీఆర్డీవో, మెదక్

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

ఎండాకాలం కూలీలు వడదెబ్బకు గురై ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది. తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలి. కూలీలు ఉదయం 11గంటల వరకు పనులు ముగించుకోవాలి. తలకు ఎండ తగలకుండా టవల్ చుట్టుకోవాలి. నిమ్మరసం, మజ్జిగ లాంటివి ఎక్కువగా తీసుకోవాలి. తెల్లటి కటన్ దుస్తులు వేసుకోవాలి. ఎండల వల్ల వడదెబ్బకు గురైతే ప్రాణాప్రాయ పరిస్థితులు ఎదుర్కోక తప్పదు.
– గణపతిరావు, వైద్యాధికారి, న్యాల్‌కల్

ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటాం

ఉపాధి హామీ కూలీలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటాం. కూలీలు పనిచేసే చోట తాగునీరు సరఫరా చేసే బాధ్యత గ్రామ పంచాయతీలకు అప్పగించాం. నీడ కోసం ఏర్పాటు చేసే టెంట్లను ప్రభుత్వం నిలిపివేసింది. కూలీలు పనిచేసే చోట మెడికల్ కిట్లు అందుబాటులో ఉండే విధంగా చూస్తాం. ప్రథమ చికిత్స కోసం అవసరమయ్యే సామగ్రిని అందిస్తాం. ఎండల నుంచి రక్షణ కల్పించడానికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేస్తాం. వడదెబ్బ తగలకుండా కూలీలు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. – రంగారావు, ఈజీఎస్ ఏపీవో, న్యాల్‌కల్

సీఎస్ఆర్ పనులు వేగవంతం చేయాలి

సంగారెడ్డి కలెక్టరేట్, మార్చి 27: సంగారెడ్డి జిల్లాలో సీఎస్ఆర్ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో సీఎస్ఆర్ నిధుల వినియోగం, పనులు, పురోగతిపై వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలో సీఎస్ఆర్ నిధులతో ప్రభుత్వ పాఠశాలలు, దవాఖానలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల మెరుగుకు వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. పాఠశాలలో అదనపు గదుల నిర్మాణం, మరుగుదొడ్ల నిర్మాణం, ప్రహరీని ర్మాణం, తాగునీటి సరఫరా, సదుపాయాల కల్పన, ప్రభుత్వ దవాఖానలకు అవసరమైన ఆధునిక పరికరాల కొనుగోలుకు సీఎస్ఆర్ నిధులు కేటాయించినట్లు వివరించారు. సమావేశంలో పరిశ్రమల శాఖ అధికారులు, వివిధ పరిశ్రమల యజమానులు, ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నర్సాపూర్ కాంగ్రెస్‌లో లుకలుకలు

- సీనియర్ నేతపై కేసు పెట్టిన జూనియర్స్
- అక్రమంగా కేసు పెట్టారని ఓ గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడి ఆవేదన
- సొంత పార్టీ నేతపైనే కేసులెంటని పలువురి చర్చ

నర్సాపూర్, మార్చి 27: నర్సాపూర్ కాంగ్రెస్‌లో జూనియర్స్ వర్సెస్ సీనియర్స్ మధ్య లుకలుకలు బగ్గుమంటున్నాయి. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, పార్టీ గ్రామ అధ్యక్షుడిపై కొత్తగా కాంగ్రెస్‌లోకి వచ్చిన నాయకులు కేసు పెట్టి అరెస్ట్ చేయించారు. వివరాల్లోకి వెళితే...నర్సాపూర్ మండల పరిధిలోని చిన్నచింతకుంట గ్రామానికి చెందిన మధుగౌడ్‌ను నూతనంగా కాంగ్రెస్‌లోకి వచ్చిన కార్యకర్తలు అక్రమంగా అరెస్ట్ చేయించారు. ఈ సందర్భంగా మధుగౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి పుట్టినరోజు సందర్భంగా చిన్నచింతకుంటలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో తన ఫొటో వేయలేదన్నారు. ఇదే విషయాన్ని పార్టీ మండల అధ్యక్షుడి దృష్టికి తీసుకుపోగా అదే గ్రామానికి చెందిన కొందరు కార్యకర్తలు ఫ్లెక్సీని చింపివేసి తనపై అక్రమంగా కేసు పెట్టారని మధుగౌడ్ ఆవేదన వ్యక్తం చేశాడు. పోలీసులు తనను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లకుండా గ్రామ శివారులోకి తీసుకెళ్లి ఫ్లెక్సీ ఎందుకు చింపావని, వారి దగ్గర ఆధారాలు ఉన్నాయని తెలిపారు. రాత్రి 8.30 గంటల సమయంలో పోలీస్ స్టేషన్‌కి తీసుకెళ్లి రాత్రి 12 గంటలకు వదిలిపెట్టారని తెలిపారు. 15 ఏండ్లుగా కాంగ్రెస్‌లో పనిచేస్తున్నానని, ఫ్లెక్సీని ఎందుకు చింపుతానని ఆవేదన వ్యక్తం చేశాడు. సీనియర్ నాయకులపై ఇలాంటి అక్రమ కేసులు పెట్టకుండా చూడాలని కాంగ్రెస్ నియోజకవర్గ, రాష్ట్ర నాయకులను కోరారు. సొంత పార్టీ నేతలపైనే కేసులు పెట్టడం ఏమిటని పలువురు చర్చించుకున్నారు.



దమ్మక్కపల్లిలో విచారణ చేస్తున్న కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్

అంబేద్కర్ విగ్రహం ధ్వంసం

- నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

కొండపాక(కుకునూరుపల్లి), మార్చి 27 : కొండపాక మండలంలోని దమ్మక్కపల్లిలో అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బస్టాండ్ సమీపంలో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించేందుకు ఏర్పాటు చేశారు. గురువారం గ్రామానికి చెందిన జింక తిరుపతి అంబేద్కర్ విగ్రహం గద్దెపై కూర్చొని కట్టెతో అంబేద్కర్ విగ్రహం చేతిని కొట్టడంతో గమనించిన గ్రామస్తులు అడ్డుకొనే ప్రయత్నం చేయగా వారిని తిడుతూ అంబేద్కర్ విగ్రహం చేతిని విరగొట్టాడు. దీంతో గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ విచారణ చేపట్టి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

ప్రభుత్వ పథకాలపై ప్రజల్లో అయోమయం

సీఎం, మంత్రులు పొంతనలేని ప్రకటనలు: నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

బీఆర్ఎస్ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్, మార్చి 27: అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలుచేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ప్రభుత్వం పథకాలు అమలు చేయకుండా ప్రజలను అయోమయానికి గురిచేస్తుందని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి మండిపడ్డారు. గురువారం సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పంట రుణమాఫీ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పొంతన లేని ప్రకటనలు చేస్తూ అసంపూర్తిగా వదిలేశారన్నారు. బీఆర్ఎస్ హయాంలో రెండు దఫాలు రుణమాఫీ చేసిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానికి దక్కిందని, రైతులు బంగారంపై తీసుకున్న రుణాలను సైతం మాఫీ చేసి ఉదారత చాటుకున్నామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు వ్యవసాయ పనిముట్లు ఇవ్వకుండా రైతుబంధు ఇవ్వడంతో పెద్ద భూస్వాములకు మాత్రమే లబ్ధి చేకూరిందని స్థానిక ఎమ్మెల్యే మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని, 50 ఏండ్ల కాంగ్రెస్ పాలనలో ఏ ప్రభుత్వం ఇవ్వని విధంగా ట్రాక్టర్లు మొదలుకొని అన్ని వ్యవసాయ పరికరాలను సబ్సిడీపై బీఆర్ఎస్ ప్రభుత్వం అందజేసిందన్నారు. రైతుబంధుతో అత్యధిక శాతం చిన్న, సన్నకారు రైతులకు ఎంతో మేలు జరిగిందన్నారు. కాంగ్రెస్ హయాంలో చెరువుల మరమ్మతుల పేరిట నిధులు కాజేశారని, బీఆర్ఎస్ ప్రభుత్వం మిషన్ కాకతీయ పథకం ద్వారా నారాయణఖేడ్ నియోజకవర్గంలో సుమారు రూ.100 కోట్లతో చెరువులను పునరుద్ధరించినట్లు గుర్తు చేశారు. పదేండ్ల కేసీఆర్ ప్రభుత్వంలో ఏనాడు రాని నీటి సమస్య, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎందుకు ఉత్పన్నమవుతుందని ప్రశ్నించారు. కేసీఆర్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికీ నల్లాల ద్వారా నీళ్లివ్వలేని అసమర్థ పాలన కాంగ్రెస్ ప్రభుత్వానిదన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పేరిట ప్రజలను మభ్య పెడుతున్నారని, 15 నెలల కాంగ్రెస్ పాలనలో ఒక్క ఇందిరమ్మ ఇల్లు నిర్మించలేదని, గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇందిరమ్మ ఇండ్ల పథకం ఏవిధంగా పక్కదారి పట్టిందో అందరికీ తెలిసిందేనన్నారు. జూకల్ శివారులో బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన 800 డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు తుదిదశలో ఉన్నాయని, వాటిని పూర్తి చేసి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. జర్నలిస్టుల డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లకు సంబంధించిన బిల్లు మంజూరు చేయించడంపై ఎమ్మెల్యే ఎందుకు దృష్టి సారించడం లేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంపై ఎమ్మెల్యే చేస్తున్న ప్రతి ఆరోపణ తప్పని నిరూపిస్తే రాజీనామాకు సిద్ధమా అని సవాల్ విసిరారు. సమావేశంలో రవీందర్ నాయక్, ఆహీర్ పరశురామ్, నగేశ్, పార్శెట్టి సంగప్ప, విఠల్‌రావు, లయక్, అంజాగౌడ్, నర్సింహులు, రవినాయక్, మల్‌గొండ, మశ్చేందర్, సలీమ్, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నైతిక విలువలను పాఠ్యాంశాల్లో చేర్చాలి

- టెడ్ఎక్స్‌లో పలువురు వక్తలు
- గీతంలో అట్టహాసంగా టెడ్ఎక్స్-2025

మాట్లాడుతున్న పల్లంరాజు



పటాన్‌చెరులో గీతం టెడ్ఎక్స్‌కు వచ్చిన ప్రముఖులతో విద్యార్థులు

పటాన్‌చెరు, మార్చి 27: నైతిక విలువలను పాఠ్యాంశాల్లో చేర్చాలని టెడ్ఎక్స్‌లో పలువురు వక్తలు పేర్కొన్నారు. గురువారం గీతం విశ్వవిద్యాలయంలో డైరెక్టరేట్ ఆఫ్ స్టూడెంట్ లైఫ్ ఆధ్వర్యంలో టెడ్ఎక్స్-2025ను కేంద్ర మానవ వనరుల అభివృద్ధి, రక్షణ శాఖల మాజీ సహాయమంత్రి పల్లంరాజు ప్రారంభించి మాట్లాడారు. చిన్నవయసులోనే పిల్లలను స్వయం సమృద్ధం చేయాలని, పాఠశాల విద్య నాణ్యతను పెంచాలని, నైతిక విలువలు, నీతి, పర్యావరణ సృహను పాఠ్యాంశాల్లో చేర్చాలన్నారు. విద్యారంగం, పరిశ్రమల మధ్య అంతరాన్ని తగ్గించడం, ప్రభుత్వం, ఆర్థిక సంస్థలు, వ్యవస్థాపకుల మధ్య చురుకైన భాగస్వామ్యాలను పెంపొందించడం తప్పనిసరని ఆయన పేర్కొన్నారు. మేధో సంపత్తి, ఆవిష్కరణల్లో దేశాన్ని అగ్రగామిగా నిలబెట్టడానికి పరిశోధనా పెట్టుబడులను గణనీయంగా పెంచాల్సిన అవసరం ఉందన్నారు. న్యూస్ మొబైల్ వ్యవస్థాపకుడు, ఎడిటర్-ఇన్-చీఫ్, ప్రఖ్యాత జర్నలిస్టు, గ్లోబల్ ఫ్యాక్ట్ చెకర్ సౌరభ్ శుక్లా మాట్లాడుతూ.. డిజిటల్ యుగంలో జర్నలిజం అభివృద్ధి చెందుతున్న అంశాన్ని ప్రస్తావించారు. సంచలనాత్మకత కంటే వాస్తవ కచ్చితత్వానికి ప్రాధాన్యత ఇవ్వాలని విద్యార్థులకు సూచించారు. సెలబ్రిటీ, యాంకర్, జర్నలిస్టు, కవయిత్రి అతికాఫరూఖీ, ఆర్థికవేత్త, 13వ ఆర్థిక కమిషన్ పూర్వ సలహాదారు డాక